# కథారచయిత కథ



*******************************

* రచన: శ్రీ తమ్మిశెట్టి రామారావు *

*******************************

సాయంత్రం నాల్గు గంటలు కావస్తోంది. విసుగు-విరామంలేని ప్రింటింగ్ మిషన్ల రణగొణ ధ్వని ప్రెస్ లోంచి వినవస్తోంది. ఆ యంత్రాలతోపాటు తనూ ఒక యంత్రంలా పనిచేస్తూ-ఆఫీసు గదిలో కూర్చుని దీక్షగా రచయిత(త్రు)ల దగ్గరనుండి వచ్చిన కథలను చదువుతున్నాడు రామారావు. చేతిలోని రంగు పెన్సిల్‌తో 'రైటు' గుర్తు 'ఇంటూ' గుర్తు పెడుతున్నాడు. ఇంటూ గుర్తు పెట్టిన కథలమీద 'ఆర్' అని రాస్తున్నాడు. తగినంత పోస్టేజి వుంటే వాటిని త్రిప్పి పంపించేస్తుంటాడు డిస్పాచ్ క్లర్క్.

రామారావు బి. ఏ. పట్టభద్రుడు. పైగా చిన్నతరహా కథకుడు. ఉద్యోగాన్వేషణలో విసిగి ఫుల్‌స్టాప్ పెట్టి చివరికి ప్రైవేట్ ట్యూటరైనాడు. తండ్రి చిన్నప్పుడే పోయినా తన్ని పెంచి యింతటి వాణ్ణి చేసిన తల్లినికూడా పోగొట్టుకున్న నిర్భాగ్యుడు. ఆ తర్వాత బ్రతుకుబారంతో గత్యంతరంలేక ఎక్కడో వున్న మేనమామగారి యిల్లు చేరుకున్నవాడు. మేనమామగారి స్నేహితుడు రికమెండేషన్‌తో ఒక పత్రికాఫీసులో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగంలో ప్రవేశించినవాడు. ఆ తర్వాత మేనమామ ద్వితీయ పుత్రికను అద్వితీయంగా వివాహమాడి గతజీవితాన్ని మరచి సుఖంగా జీవిస్తున్నవాడు. అన్నట్టు గతంలో దెబ్బతిన్నవాడు.

రామారావు ఆంధ్రప్రదేశ్ నుండి వెలువడే ఒక తెలుగు వారపత్రిక్కి సబ్-ఎడిటర్‌గా మూడు సంవత్సరాల అనుభవం గడించాడు. ఆఫీస్‌కి వచ్చిన కథలను ఫైల్ చేయడం, తీరికనుబట్టి వాటిని చదివి బాగున్నవి సెలక్ట్ చేయడం, అవి ఎడిటర్‌కి పంపడం, అప్పుడప్పుడూ ప్రూఫ్ రీడింగ్స్ చూడడం మొదలైన పనులు చేస్తుంటాడు.

రోజూ కొన్ని వందల కథలు పత్రికాఫీస్‌కి వస్తుంటాయి సాధారణంగా. అందులోంచి ప్రచురణకి స్వీకరింప బడేవి నాల్గయిదు కన్న ఎక్కువ వుండవు.

తను ఇప్పటికి ఎన్ని వందల కథలో చదివాడు. ఎన్ని వందల కథలో తన చేత్తో చెత్తబుట్టకి దాఖలు చేశాడు మరెన్నివందల కథలో త్రిప్పి పంపించాడు.

తనూ మొదట్లో కథలు రాసి పంపేటప్పుడు కొన్ని కథలు తిరిగి వచ్చేవి. అప్పుడు తను ఎంత ఫీలయేవాడో. తన కింకా గుర్తుంది. రాయడం చాతయిన ప్రతివారు తమ రచనలు అచ్చులో చూచుకోవాలని ఆతృతపడుతుంటారు. కాని ఆ కథ తిరిగి వచ్చినపుడు ఆ కథా రచయిత ఎంతగా ఫీల్ అవుతుంటాడో తనకు తెలియంది కాదు.

ప్రక్క టేబుల్స్‌వైపు తదేకంగా చూసాడు. మిగిలిన ఇద్దరు సబ్-ఎడిటర్స్ కథలు సీరియస్‌గా చదువుతున్నారు. వాళ్ళ చేతుల్లోని రంగు పెన్సిల్స్ కథలమీద చకచకా గుర్తులు పెడుతున్నాయి. కాని వాళ్ళ ముఖాల్లో విసుగుదల స్పష్టంగా కానవస్తోంది. ఒక్కొక్కటి పూర్తిగా చదవకుండానే త్వరత్వరగా 'ఇంటూ' గుర్తులు పెట్టి ప్రక్కన పెట్టేస్తున్నారు. వాళ్ళను చూసి చిన్నగా నవ్వుకున్నాడు రామారావు. లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ తనూ ఒక కథలోకి దృష్టి మళ్ళించి సీరియస్‌గా చదవసాగాడు.

* * *

ఏవండీ! ఎందుకో ప్రైవేట్ క్లాస్ వదిలిపెట్టిన తర్వాత నన్ను వుండమన్నారట ఎందుకండీ? అన్న

రామం గొంతు అప్పటికి పదిసార్లు మారుమోగింది. కాని తలుపులు తెరుచుకోలేదు. ఎంతకూ సమాధానం రాక పోయేసరికి విసుగుపుట్టి వెనుతిరగబోయాడు క్రొత్తగా ప్రైవేట్ మాస్టారు అయిన రామం.

రామం పేదవాడు. అయినా తెలివైనవాడు. తన తెలివితేటలమీదే బి. ఏ. పాసై ప్రస్తుతం నిరుద్యోగిగా వుంటున్నాడు. కాని పొట్టగడిచే మార్గంలేక, పుట్టిన వూళ్ళో మంచి పేరుంది కనుక ఒక దూరపుబంధువు దయాభిక్షమీద ఆయన ఇంటి బయట వరండాలో రోజుకి రెండు గంటలు పిల్లలకి ట్యూషన్స్ చెప్పుకుని బుద్ధిగా వెళ్ళిపోతుంటాడు. పిల్లలకి శ్రద్ధగా పాఠాలు చెప్పడంతో మొదట్లో ఐదారుగురు పిల్లలలో మొదలుపెట్టిన ప్రైవేట్ క్లాస్ ఇప్పుడు చిన్న ప్రైమరీ పాఠశాలగా తయారైంది.

సాధారణంగా ఆ ఇంటి తలుపులు తెరిచేవుంటాయి. ఒక్క రామం ప్రైవేట్ క్లాస్ చెప్పుకునే సమయంలో తప్ప. ఆ బిల్డింగ్‌లో రెండు పోర్షన్లు వున్నాయి? ఆ రెండూ అద్దెకివ్వబడ్డవే. తన కేరాఫ్ అడ్రసుకి వచ్చిన ఉత్తరాలు జాగ్రత్తచేసి ఇస్తుంటారు వాళ్ళుకూడ. నెలాఖరున యింటి యజమాని అద్దె వసూలు చేయడానికి వస్తుంటాడు. ఇదిగాక ఆ వూళ్ళో ఇంకా రెండు పెద్ద బిల్డింగ్స్ వున్నాయాయనకి. వచ్చినపుడు రామాన్ని ఒకసారి పల్కరించి పోతుంటాడు. "ఏదైనా ఉద్యోగానికి ట్రై చేయకూడదటోయ్" అంటూ-

తానైతే తెలివితేటల్తో డిగ్రీ సంపాదించుకోగలిగాడే కాని వుద్యోగం ఎవరు సంపాదించి పెడతారు. ఎందుకంటే తన కులంలోగాని కుటుంబంలోగాని పెద్ద చదువులు చదివి వుద్యోగాలు వెలగబెడుతున్నవారు లేరు. అందుకే తనకు ఎవరివలన రికమెండేషన్స్ దొరకలేదు. వుద్యోగాన్వేషణలో విసిగి వేసారి తుదకు ఆఖరి తిలోదకాలు వదలేశాడు. బ్రతకడానికి బడిపంతులయ్యాడు తనెంతకీ ప్రయోజకుడు కాలేనందుకు తన్ను చూసి దిగులుతో మంచమెక్కిన తల్లికి అవసానదశలో గుక్కెడు గంజినీళ్ళు పోయడానికి వున్న కాస్త ఆస్తి తన చదువుకే సరిపోయింది.

"వెళ్ళిపోతున్నారా? వుండండి" అన్న సన్నని గొంతు సంగీతంలా వినిపించేసరికి చివరి మెట్టు దిగుతున్న రామం అడుగు అక్కడితో ఆగిపోయింది. వెనుదిరిగి చూసాడు. గుమ్మం తలుపులు తెరుచుకునివున్నాయి. గుమ్మానికి ఆనుకొని అభిసారికలా నిలబడివుంది విమల.

ఎందుకండీ? నన్ను పిల్చారట అని ఆడపిల్లకంటే

WITH THE BEST
COMPLIMENTS
FROM............

PHONE: 21675

# LEELA HOSIERY MILLS

RAYAPPAPURAM EXTENSION

TIRUPUR-638601

Manufacturers of:

FANCY HOSIERY GOODS AND BRASSIERES

ఆధ్యాన్నంగా సిగ్గుపడుతూ, విమల చెంతకు వస్తూ అన్నాడు రామం.

"ఇలా వచ్చి కూర్చోండి. మీతో చిన్న పని వుంది" అంటూ కుర్చీ చూపించి లోనికి తూనీగలా తుర్రుమని లోనికి వెళ్ళిపోయింది విమల.

రామాన్కి కొంచెం భయం, గుండెదడ పట్టుకున్నాయి. విమల తన్ను ఆహ్వానించి కూర్చోబెట్టడం లోని అంతరార్థం ఏమిటో అంతుపట్టడం లేదు తనకి. ఎదురుగావున్న టేబుల్ మీది పత్రిక చేత్తో తీసుకుంటూ ఒకసారి పరిసరాల్ని పరికించాడు. విమలతోపాటు వాళ్ళ అమ్మ రాజ్యలక్ష్మి వుండేది ఆమె మాత్రం కనబడలేదు.

వీక్లీలోకి తల మళ్ళించాడు రామం. "అరే ఈ వారం వీక్లీలా వుందే, అట్ట చిరిగి వుండడంచేత గమనించలేకపోయాడు తను. అందులో తన కథకూడ వుంది" అని స్వగతంలో అనుకుని గబగబ తన కథవున్న పేజీ త్రిప్పి చూసుకో సాగాడు రామం.

అంతలో విమల కాఫీ కప్పు చేత్తో పుచ్చుకుని అపర మోహినిలా ప్రత్యక్షమైంది. రామాన్ని తీసుకోమని సౌంజ్ఞ చేస్తూ టేబిల్ మీద పెట్టింది కాఫీ కప్పు.

"మీకు వృధాగా ట్రబులిస్తున్నట్లున్నాను. నాకలాంటి అలావాట్లు లేవండీ!"

"తీసుకోండి పరవాలేదు. ఆడపిల్లలా సిగ్గుపడతారేం? నిజంగా మీ కథల్లోవున్న హీరో లక్షణాలు మీలో లోపించాయి. కథల్లో హీరోకి చూపించిన ధైర్యం వుత్సాహం కాస్తయినా మీలో లేవు. నా మాట కాదంటారా?" అని సూటిగా రామం కళ్ళలోకి చూస్తూ అంది విమల.

ఎప్పుడూ రామం ఆమెతో ముఖాముఖి మాట్లాడి ఎరుగడు. ఆమె అలా ఉపోద్ఘాతం మొదలుపెట్టే సరికి రామం గొంతులో ఎలక్కాయ పడినంత పనైంది. కొద్దిసేపు తటాపటాయించి గుక్కెడు కాఫీనీళ్లు గొంతులో పోసుకుని కప్పు టేబుల్ మీద పెడుతూ అన్నాడు.

"ఏమిటండీ! అసలు కథ చెప్పక, కథలూ కాకరకాయలూ అంటూ మొదలుపెట్టారు. నేను కథలు రాస్తున్నట్లు మీ కెవరు చెప్పారు ఇంతకీనూ."

ఏమండోయ్! మీరు చెప్పనంత మాత్రాన తెలియక పోతుందా? నిజం ఎప్పటికైనా దాగుతుందా?

నిన్న మధ్యాహ్నం మీరు ప్రైవేట్ క్లాస్ చెప్తుతుండగా మధ్యలో ఏవో పిల్లల అరుపులు వినిపించాయి. ఏమిటి చెప్మా! అని కిటికీ తలుపులు తెరచి ఓరగా నిలబడి చూసాను. మా విద్యార్థులంతా ఆనందంతో గెంతుతూ మాష్టారికథ పడిందోయ్...మాష్టారు కథ పడిందోయ్...అంటూ గోల పెడుతున్నారు. మీరు వాళ్ళను అదమాయిస్తూ పోస్ట్‌మేన్ చేతుల్లోనుండి వాళ్ళ చేతుల్లో పడి నలిగిపోతున్న పత్రికను లాక్కుంటున్నారు. అప్పుడే మీ గురించి అనుకున్నాను. మీరు వెళ్ళిపోయిన తర్వాత ప్రక్కింటి వేణుని పిల్చి అడిగితే అంతా చెప్పాడు. నాకూ మీ కథ చదవాలనిపించింది. వాడి చేతే షాపునుండి పత్రిక తెప్పించాను. ఇదే పేరుతో ఇంతకు ముందు కొన్ని కథలు చదివాను. కాని మీ రను కోలేదు. ఇంతకూ మీరు కథలు ఎలా రాయడం మొదలు పెట్టారు? మీ మొదటి కథ ఏ పత్రికలో పడింది.

అంతసేపూ గలగల పారే వాక్ప్రవాహం ఒక్కసారిగా ఆగిపోయినట్లనిపించింది రామాన్కి. అమాయకంగా అంటున్న విమల మాటలకి నవ్వు పుట్టుకొచ్చింది కూడా.

"ఏమండీ కథలు ఎప్పుడు ఎలా రాస్తానంటే, ఏమని చెప్పనండి. ఏదో తీరిగ్గా కూర్చున్నప్పుడు మనసులో మెదిలే భావవీచికలకు రూపకల్పన చేస్తుంటాను. నా మొదటి దీ పత్రికలోనే వచ్చింది."

"ఇంతకూ మీరు అన్నీ ప్రేమకథలే రాసినట్లున్నారు. అవీ ట్రాజడీలేను. అవికాకుండా కామెడీ కథలు రాయకూడదూ!"

"మీకు ట్రాజిడీలంటే ఇష్టం వుండదాండీ?"

"లేదండీ? టైటిల్ చూడగానే పేజీ త్రిప్పేస్తాను."

"అలాగా!"

"ఇంతకీ ఇంట్లో మీ అమ్మగారు లేనట్లున్నారు? ఎక్కడ కెళ్ళారండీ."

మా దూరపు బంధువుల ఇంట్లో ఏదో వ్రతముందంటేను వెళ్ళింది.

"ఇంతకూ ఈ పత్రికలో పడిన కథని సుఖాంత చేసి "ప్రేమ ఫలించింది" అని పేరు పెడితే బావున్నాండీ!"

"అదంతా రచయిత హృదయంమీద ఆధారపడి వుంటుందండి. ఒక్కొక్క రచయితకి ఒక్కొక్క పరిధి

ఆటోమేటిక్‌గా అలవడిపోతుంది. ఎంత గింజుకున్నా ఆ పరిధిని దాటి రచన చేయలేదు.''

''అలాగైతే మీరు కాలేజీలో చదివేటప్పుడు ఎవరినైనా ప్రేమించి విఫలమయ్యారా? మీ కథ లెప్పుడూ ఆ పరిధిలోనే విహరిస్తూవుంటాయి.''

అబ్బే అదేంలేదండీ? ప్రేమ కథలు రాయడానికి ఒకర్ని ప్రేమించనవసరం లేదు. పరిసరాల్ని పుస్తకాల్ని చూస్తే ఆ మాత్రం తెలియకపోదు.

''సారీ! ఏమనుకోకండి! ఏదో సరదాగా అన్నాను. అంతే!''

''ఏమండీ! టైం అయిపోతోంది. ఇంతకీ అసలు కారణము చెప్పారుకాదు.''

''ఏమండీ! మీలాగ నేను కొన్ని కథలు రాసి పత్రికలకు పంపిస్తున్నానండి. కాని అవి సురక్షితంగా తిరిగి వచ్చేస్తున్నాయి తగినంత పోస్టేజ్ పెడుతున్నాను కాబట్టి. ఆ మధ్య ఒక కథ పంపించానండి. అది చాలా బాగా రాసానుకూడ. అయినా మొన్ననే తిరిగి వచ్చేసింది. ఇంతకూ పత్రికల వాళ్ళకి బుద్ధిలేదండి. అన్యాయపాపం అన్ని సార్లు పంపించిందికదాయని, ఒక్క కథైనా వేసున్నారాండీ! ప్రతిసారి కథ తిరిగివచ్చినపుడు నే నెంత ఫీల్ అవుతున్నానో వాళ్ళకేం తెలుస్తుంది...'' దాదాపు ఏడ్చేస్తునే చెప్పింది విమల.

''ఏమండీ! ఎందుకలా బాధపడతారు! కథ బావుంటేనే కదా ప్రచురిస్తారు. అలాంటప్పుడు రచయిత బాధపడేది లేనిది వాళ్ళ కనవసరం...'' ఓదార్చబోయాడు రామం. ఇద్దరి మధ్య కొంత నిశ్శబ్దం.

''ఇంతకీ మీరేమి రాసారో ఒకసారి చూపించండి! మీ కథల్లో లోపాలేమిటో చదివి చెప్తాను.''

వెంటనే మొన్న తిరిగి వచ్చిన కథని తెచ్చి ఇచ్చింది విమల. అందుకొని స్క్రిప్ట్ గబగబ చదవబోయాడు రామం.

రామానికి మతిపోయినంత పనైంది.

''ఏమండీ! కథలు రాసేటప్పుడు మరీ చీమతలకాయ అంత అక్షరాలు రాస్తే ఎలాగండీ? మీరు రాసిందేమిటో పత్రిక వాళ్ళకి అర్థమవ్వాలా? లేదా? మీ వుద్దేశంలో పత్రిక వాళ్లు బూతద్దాలు పెట్టుకుని చదువుతారనుకున్నారా?''


V.S.G పిస్టన్ పంపు



సెల్ఫ్ ఆయలింగ్ మరియు ప్రైమింగ్
డబల్ ఆక్షన్.
'వి.ఎస్.జి.' పంపులను ఆటోమేటిక్ సిస్టమ్‌లో వుండే ప్రెషర్ టాంకులకు ఉపయోగించవచ్చును.
హోటల్స్‌లకూ, బంగళాలకు బావినుంచి నీళ్లు పొడుటకు అత్యంత ఉపయోగమైనది.



''వి. ఎస్. జి.'' సెల్ఫ్ ప్రైమింగ్
సెంట్రిపేటల్ పంపులు
మీ ఇంటి బావినీళ్ళకు, తోట వ్యవసాయానికి చాలా అత్యవసరమైనది.

తయారించువారు

Phone : 33798

V.S.G. ENGINEERING INDUSTRY
KRISHNARAYAPURAM ROAD.
*Ganapathi (PO)* : Coimbatore 641006

ఆ మాటలకు పగలబడి నవ్వింది విమల. ఆ తర్వాత సావధానంగా అంది "నా చేతి రాతే అంతండి" అని.

ఆమెను నిరుత్సాహపరచడం తన కిష్టంలేక మళ్ళీ ఇలా అన్నాడు రామం.

"ఏమండీ! మనం కథలు రాసేటప్పుడు జాగ్రత్తగా రాయాలి. ప్లాట్, థీమ్ బావున్నా, గ్రామర్ మిస్టేక్స్ వగైరాలు వుంటే ప్రచురించుకోరు పత్రికవాళ్ళు. అందుకే కొన్ని కథలు బావున్నా తిప్పి పంపించేస్తుంటారు."

"సరేలెండి! ఈ ఒక్కసారి కథ దిద్ది పెట్టండి. మళ్ళో పత్రిక్కి పంపుతాను. నా అదృష్టం ఎలా వుంటే అలా వుంటుంది."

అలాగేలెండి. ఒకటి రెండు రోజుల్లో కథ దిద్ది నేను ఫెయిర్ చేసి ఇస్తాను, అంటూ శెలవుతీసుకొని వెళ్ళిపోయాడు రామం.

* * *

విమల కథ ప్రచురణకి అంగీకరింపబడినట్లు మూడు నెల్ల తర్వాత పత్రికాఫీసునుంచి కార్డు వచ్చింది. విమల సంతోషానికి అవధుల్లేవు. ప్రప్రథమంగా తన కథ ప్రచురింపబడుతున్నదంటే, ఏదో అలభ్య వస్తువు దొరుకుతున్నంత సంబరపడిపోయింది. రామం కూడ ఆమె సంతోషంలో సగంపాలు పంచుకున్నాడు. రానురాను విమలతో పరిచయం ఎక్కువైంది. ఖాళీ దొరికినప్పుడు తనతోపాటే పిల్లలకి పాఠాలు బోధపర్చడం, లెక్కలు ఒప్పజెప్పించుకోడం చేసేది. రాజ్యలక్ష్మికూడ రామంతో కలుపుగోలుగా మాట్లాడేది అప్పుడప్పుడూ.

ఒకనాడు ప్రైవేట్ క్లాస్ వదలిపెట్టి పరధ్యానంగా కూర్చున్న రామాన్ని చూసి "ఎందుకలా వున్నావని" అడిగింది విమల. విమల రామాన్ని ప్రేమించి ఏకవచనంలోకి దిగింది మరి. రామం కూడ అంతే.

"మా అమ్మకి రాను రాను మరీ సీరియస్ గా వుంటోంది విమలా!" అన్నాడు దీనంగా శూన్యంలోకి చూస్తూ.

"అలాగైతే గవర్నమెంట్ హాస్పిటల్ లో ఎడ్మిట్ చేయించలేక పోయావా?"

"మా అమ్మకి మందులమీద నమ్మకంలేదు విమలా! వచ్చేముండని నా కెందుకురా బాబు మందులు మాకులు అంటుంది. నేను దగ్గరుండి బ్రతిమాలితే ఆ ఒక్క గుక్కెడు రంగు నీళ్ళయినా త్రాగుతుంది. లేకపోతేలేదు. ఇదంతా చూస్తుంటే మా అమ్మ బ్రతుకుతాదన్న ఆశ లేదు." కంట తడిపెట్టుకుంటూ అన్నాడు రామం.

"ఛ!! అలా ఆడ పిల్లలా బెంబేలు పడిపోతావేం రామం. మీ అమ్మకి తప్పక నయమవుతుంది."

"అన్నట్లు మీ అమ్మకి సుస్తీ ఏమిటన్నావు"

"దగ్గు, ఆయాసం."

"బహుశా లంగ్స్ దెబ్బ తిన్నాయేమో పట్నం తీసుకెళ్ళి ఎక్స్-రే- తీయించలేకపోయావా?"

అందుకు మా అమ్మ ఒప్పుకోవడంలేదు. పైపెచ్చు ఎందుకు డబ్బు దండగ అంటుంది.

"అలాగైతే వుండు మంచి మెడిసన్ వుంది తెస్తాను." అంటూ లోనికి వెళ్ళి క్షణంలో ఏవో మందులు చేత్తో పుచ్చుకొని వచ్చింది విమల.

"ఇవేమిటి విమలా? ఈ మందులు నీకెక్కడివి."

"మా నాన్నగారు ఓ మందుల కంపెనీకి రిప్రజెంటేటివ్ గా పనిచేస్తున్నారని చెప్పానుగా. శాంపిల్స్ అన్నీ మా ఇంట్లోనే వుంటాయి. మొన్న వచ్చేట్పుడు మా నాన్నగారు తెచ్చి చూపించారు."

ఐ. సీ. అయితే వస్తాను విమలా? అంటూ మందులు తీసుకొని వెళ్ళాడుతను. ఒక దుర్ముహూర్తాన అర్థరాత్రి వేళ రామం తల్లి అసువులు అనంత వాయువులో లీనమై పోయాయి. రామం తల్లి పోయినందుకు విమల చాలా విచారించింది. స్వయంగా రామం దగ్గరకి వచ్చి ఓదార్చి మరీ వెళ్ళింది. అప్పటినుండి రామంలో వైరాగ్యం పెరుగుతునే వుంది. ప్రైవేట్ క్లాసులు కూడ సరిగా చెప్పడం మానుకున్నాడు. సమయం చిక్కితే ఒంటరిలో కూర్చుని దీర్ఘాలోచన చేయుడం మొదలుపెట్టాడు. రోజులు భారంగా దొర్లిపోతున్నాయి.

ఒకరోజు రామం ఒంటరిగా కూర్చున్నప్పుడు విమల చెప్పింది.

"నాకు మేరేజ్ సెటిల్ అవబోతున్నది."

"శుభవార్త వింటున్నాను."

"వరుడు ఎవరో తెలుసా?"

"ఇంతవరకూ తెలియదు."

“నా నోటిమీదుగా చెప్పించడం తమ అభిమతం కాబోలు.”

“ ”

“అయినా రాయిలా పులుకూ పలుకూ లేకుండా వున్నావు. నేనే చెప్తున్నాను విను.”

“చెప్పు.”

“రామం అని ఒక వర్ధమాన రచయితని.”

“ఏం చూసి నన్ను ప్రేమించావు. ఏం కావుకుంటావు?”

“నాకు నచ్చిన మనసుని, నన్ను మెచ్చిన మనిషిని చూసి.”

‘నేనంత అదృష్టజాతకుణ్ణి కాదు.”

“ఎందుచేత?”

“మన పెండ్లికి మీ పెద్దవాళ్ళు అంగీకరించరు కనుక.”

“అంగీకరించరని నాకు తెలుసు. కాని ఇష్టంలేని సంబంధం చేసుకోలేను.”

నీవు కాదంటే నాకు మరణమే శరణ్యం.

“నేను అంగీకరిస్తే మటుకు ఏమిటి గత్యంతరం?”

మనం ఈ రాత్రికే ఎక్కడైనా వెళ్ళిపోదాం. నా దగ్గర కొన్ని నగలు, కొంత డబ్బు వుంది. ప్రస్తుతం ఎలాగో గడచిపోతుంది. ఈలోగా నీవు వుద్యోగ ప్రయత్నం చేద్దువుగాని.”

సరే నీ ఇష్టప్రకారమే నేను సిద్ధమౌతున్నాను...ఆ రోజు అర్ధరాత్రి విమల, రామం కలసి చెట్టాపట్టాలు వేసుకొంటూ స్వేచ్ఛాజీవుల్లా రైల్వేస్టేషన్ వైపు దారితీసారు.

* * *

కథ సాంతం చదివిన రామారావు ముఖంలో రంగులు మారాయి. ఆవేశంతో ఒళ్ళు గుబగుబ లాడింది. రచయిత్రి పేరు అడ్రసు చూసాడు. పొరపాటు లేదు. ఇది కమల రాసిన కథే. కాని చివరిలో పూర్తిగా మార్చేసింది. ఆమె కథలో చెప్పిన ఆదర్శం నిజజీవితంలో ఆచరణలో పెట్టలేక పోయింది. కట్టుకథల ద్వారా ఆదర్శాన్ని చెపుతోంది. ఆమె రాసిన కథ తమ పత్రిక్కి హైలైట్ కావచ్చును. కాని తన జీవితానికి చీకటి అవుతుంది మరి.

“కమలా! నీ కథను నా చేతులమీదుగా ఎడిట్ చేయడం నీ దురదృష్టం. కాని అది నాకు అదృష్టం. నా గుండెలో మానిపోయిన తియ్యని గాయాన్ని మళ్ళీ నీ కథద్వారా జ్ఞప్తికి తెచ్చావు. అంధకార బంధురమైన మన ప్రేమకథ వెలుగులోనికి రాకూడదు. రానీయను. అందుకే నీ కథ ప్రచురింపబడదు...అందుకే ఈ కథ ప్రచురింపబడదు” అని స్వగతంలో గొణుక్కుంటూ విసురుగా కథమీద ‘ఇంటూ’ గుర్తు పెట్టేశాడు రామారావు తర్వాత ముఖంమీద పట్టిన స్వేదబిందువుల్ని రుమాల్తో తుడుచుకున్నాడు. బరువెక్కిన హృదయంతో భారంగా లేచి, తాను సెలెక్ట్ చేసిన కథల ఫైల్ పట్టుకొని ఎడిటర్ గదివైపు నడిచాడు సబ్-ఎడిటర్ రామారావు, ఉరఫ్ ఒకనాటి రచయిత.

అందానికి –

మన్నికకూ –

కె. పి. జి. బనియన్లనే

వాడి సంతృప్తి పొందండి.

ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.

: తయారించువారు :

K. P. G. KNITTING CO.

Kariya Gounder Street

KHADERPET :: TIRUPUR-638601